క్లుప్తంగా

విద్యుత్ బిల్లులు చెల్లింపునకు నేటి వరకు గడువు

మాచర్ల: పట్టణంతోపాటు, రూరల్ పరిధిలో విద్యుత్ బకాయిలు ఉన్నవారు, బిల్లులు చెల్లించని వారు గురువారం రాత్రి లోపు తప్పకుండా బిల్లులు చెల్లించాలని విద్యుత్ శాఖ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సింగయ్య బుధవారం తెలిపారు. విద్యుత్ బకాయిలు ఎక్కువగా ఉన్నాయని, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది బకాయి ఇంటి వద్దకు నేరుగా వస్తారని, వెంటనే బిల్లులు చెల్లించాలని వినియోగదారులకు సూచించారు.

నేడు పురపాలక సంఘ సమావేశం

మాచర్ల: పట్టణ పురపాలక సంఘ సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు బుధవారం తెలిపారు. స్థానిక కౌన్సిల్ హాల్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి చైర్మన్ మదార్ సాహెబ్ అధ్యక్షత వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హాజరవుతారన్నారు. కౌన్సిలర్లు, అధికారు లు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

బస్సు సర్వీసు సమయం మార్పు

మాచర్ల: మాచర్ల ఆర్టీసీ డిపోకు చెందిన శిరిగిరిపాడు నుంచి నరసరావుపేట వెళ్లే ఆర్టీసీ సర్వీసు సమయంలో స్వల్ప మార్పు చేసినట్లు డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి బుధవారం తెలిపారు. ఉదయం 5.30 గంటలకు శిరిగిరిపాడులో బస్సు బయల్దేరి యర్రబాలెం, ముటుకూరు, దుర్గి మీదుగా కారంపూడి చేరుకుని, అక్కడి నుంచి నరసరావుపేట ఉదయం 8.30 గంటలకు చేరుకుంటుందని వీరాస్వామి తెలిపారు. బస్సు సర్వీసు సమయం మార్పు ప్రయాణికులు గమనించాలని సూచించారు.

పంటల బీమా చేయించుకోవాలి

మాచర్ల: రైతులు పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పాపకుమారి కోరారు. మండలంలో పొలం పిలుస్తోంది బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 31వ తేదీ లోగా పంటల బీమా చెల్లిస్తే పంట బీమా వర్తిస్తుందన్నారు. ఆగస్టు 15వ తేదీ లోగా వరి పంటకు బీమా చెల్లించవచ్చన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఎం.మార్కండేయులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది అంజినాయక్, బి.ప్రతాప్‌కుమార్ పాల్గొన్నారు.

కవి రవికుమార్‌కు సాహితీ పురస్కారం




దాచేపల్లి: స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ ఉపాధ్యాయుడు కోసూరు రవికుమార్‌కు సాహితీ పురస్కారం దక్కింది. రవికుమార్ రాసిన దాపల కవిత్వ సంపుటికి ఈ పురస్కారం వరించింది. ఖమ్మంలోనే హాసిని రామచంద్ర లీటరసీ ఫౌండేషన్ నిర్వాహకులు, సాహితీవేత్త అబ్దుల్ రాజా హుస్సేన్ ఈ కవిత్వానికి ద్వితీయ స్థానాన్ని ప్రకటించారు. దీంతో ఆగస్టు 17వ తేదీన ఖమ్మంలో నిర్వహించనున్న కార్యక్రమంలో కవి రవికుమార్ పురస్కారాన్ని అందుకోనున్నారు.

పొలం బాట సమస్యకు త్వరలో పరిష్కారం



దాచేపల్లి: పొలం బాట సమస్యలను త్వరంలో పరిష్కరించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మండలంలోని పెదగార్లపాడు, తంగెడ గ్రామాల్లో పొలాలను బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రెండు గ్రామాల్లో సుమారు 90 ఎకరాలకు వెళ్లే పొలాలకు సంబంధించి పొలంబాట సమస్యగా ఉండటంతో సంబంధిత రైతులు ఈ సమస్య పరిష్కారం కోసం వినతిపత్రం అందించినట్లు చెప్పారు. పొలంబాటకు వెళ్లేందుకు కొంతమంది రైతులు పొలాల నుంచి కొంత భూమిని సేకరించాల్సిన అవసరం ఉందని, దీనిపై సంబంధిత రైతులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



నకరికల్లు: రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఘటనకు సంబంధించి ఎస్‌ఐ చల్లా సురేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని చల్లగుండ్ల సమీపంలోని గోరంట్ల మేజర్ వద్ద మంగళవారం రాత్రి రోడ్డు దాటుతున్న వ్యక్తిని నరసరావుపేట వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. తీవ్రగాయలపాలైన వ్యక్తి నరసరావుపేట వైద్యశాలకు తరలిస్తుండగా మృతిచెందాడు. మృతుడు మాసిపోయిన నలుపు టీషర్ట్, జీన్‌ప్యాంటు ధరించి గడ్డంతో ఉన్నాడు. వయస్సు 60కి పైగా ఉంటుందని యాచకుడు అయి ఉంటాడన్న సందేహం వ్యక్తమవుతుందన్నారు. మృతదేహం నరసరావుపేట ఏరియా మార్చురీలో ఉందని ఆచూకీ తెలిసిన వారు 9440796246 నంబరుకు తెలియజేయాలని ఎస్‌ఐ చల్లా సురేష్ తెలిపారు.

జగనన్న కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టాలి

- కనీస సౌకర్యాలు కరవు
- కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ల డిమాండ్



కౌన్సిల్ అధ్యక్ష స్థానంలో చైర్‌పర్సన్ సుబ్బమ్మ

దాచేపల్లి: జగనన్న కాలనీలో సమస్యలు విలయ తాండవం చేస్తున్నాయి... కనీస సౌకర్యాలు లేక జగనన్న కాలనీల్లో నివసిస్తున్న ప్రజలంతా ఇబ్బంది పడుతున్నారని కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఒకటో వార్డు కౌన్సిలర్ చాట్ల క్రాంతి కుమార్ మాట్లాడుతూ జగనన్న కాలనీలో అడుగు లోతు గుంతలు ఏర్పడడం వలన ప్రజలు రాకపోకలకు చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కాలనీలోకి స్కూల్ బస్సులు కూడా వచ్చే పరిస్థితులు లేదని చెప్పారు. జగనన్న కాలనీలో తాగునీటి సమస్యలు కూడా ఎక్కువగానే ఉన్నాయని, అధికారులు తక్షణమే స్పందించి జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పనకు కృషి చేయాలని కోరారు. 11వ వార్డు కౌన్సిలర్ నగబడి గురువులు మాట్లాడుతూ డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. గతంలో పనులు చేయడం కోసం వేసిన టెండర్లను రద్దు చేశారని, ఇప్పుడు ఆ పనులను చేసేందుకు టెండర్లు వేసి సకాలంలో పనులు చేయాలని ఆయన కౌన్సిల్ దృష్టి తీసుకొచ్చారు. వైస్ చైర్మన్ కొమరబత్తిన అన్నపూర్ణ మాట్లాడుతూ స్టేషన్ రోడ్‌లో ప్రస్తుతం రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని, డ్రెయినేజీలు లేకుండా రోడ్డు నిర్మించడం వలన మురుగు పారేందుకు ఇబ్బందికరంగా ఉంటుందని, దీని వలన సమీప నివాస గృహాల ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉందని చెప్పారు. డ్రెయినేజీతో కలిపి స్టేషన్ రోడ్డు విస్తరణ పనులు చేయాలని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. చైర్‌పర్సన్ సుబ్బమ్మ మాట్లాడుతూ కౌన్సిల్ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని నగర పంచాయతీ అధికారులను కోరారు. జగనన్న కాలనీలో మౌలిక వసతులకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. సవఅఆవేశంలో కమిషనర్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ షేక్ మస్తాన్‌బీ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను ఇంటికి బిగించొద్దు


పిడుగురాళ్లలో అవగాహన కల్పిస్తున్న నాయకులు

పిడుగురాళ్ల: స్మార్ట్ మీటర్లు ఇంటికి బిగించొద్దని కోరుతూ పట్టణంలోని గాంధీనగర్‌లో ఇంటింటికి తిరిగి సీపీఎం నాయకులు సంతకాల సేకరణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... మోదీ ప్రభుత్వం అదానీ కంపెనీకి విద్యుత్ మీటర్లు బిగించి దోచుకోవటానికి అవకాశాలు కల్పిస్తుందని ఆరోపించారు. ఆ మీటర్ ఖరీదు ప్రజల నుంచి పదివేల నుంచి రూ.17 వేల వరకు వసూలు చేయటం జరుగుతుందని హెచ్చరించారు. ఇప్పుడే కస్టమర్ చార్జీలు, సర్వీస్ చార్జీలు రకరకాల చార్జీలతో మూలిగే నక్కపై తాటికాయపడినట్లుగా పడుతుందని ఈ మీటరులు బిగించడానికి ప్రజలందరూ వ్యతిరేకించాలని కోరుతూ ఆగస్టు 5వ తేదీ సచివాలయాలు దగ్గర జరిగే ధర్నాలో ప్రజల పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సంతకాల సేకరణ కార్యక్రమంలో సీపీఎం నాయకులు తెలకపల్లి శ్రీనివాసరావు, షేక్ బాబు, చిట్టిమాల ముక్కంటి పాల్గొన్నారు.

సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి గంధంతో అలంకరణ



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులోని నాగుల గుడి దేవస్థానంలో శ్రావణ శుద్ధ షష్టి సందర్భంగా సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని 27 కిలోల గంధంతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ పూజారులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తుల దర్శనార్థం ఉంచారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు అందజేశారు.

మండల బూత్ కమిటీ అధ్యక్షుడిగా శివారెడ్డి



కారెంపూడి: వైఎస్సార్ సీపీ మండల బూత్ కమిటీ అధ్యక్షుడిగా మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన కోట శివారెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా పార్టీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే), పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొమ్మిరెడ్డి ఎర్ర గురవారెడ్డి తదితర పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తామని మండలంలో పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని ఈ సందర్భంగా శివారెడ్డి పేర్కొన్నారు.

వేపకంపల్లి ఎంపీటీసీ స్థానానికి తొలి రోజు నామినేషన్లు నిల్

కారెంపూడి: మండలంలోని వేపకంపల్లి ఎంపీటీసీ స్థానానికి నిర్వహించనున్న ఉప ఎన్నికకు తొలి రోజు బుధవారం నామినేషన్లు దాఖలు కాలేదని ఎన్నికల అధికారి డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి బుధవారం సాయంత్రం తెలిపారు. వేపకంపల్లి వైఎస్సార్ సీపీ ఎంపీటీసీగా వైస్ ఎంపీపీగా కొనసాగిన కోకా అక్కమ్మ మృతి చెందడంతో ఆ స్థానాన్ని భర్తీ చేయడానికి ఉప ఎన్నికకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ఇచ్చింది. నామినేషన్ దాఖలుకు బుధవారం నుంచి ఆగస్టు ఒకటో తేదీ సాయంత్రం వరకు గడువు ఉంది. ఐదో తేదీ మూడు గంటల లోపు నామినేషన్ల విత్ డ్రా చేసుకోవచ్చని ఆ తర్వాత సాయంత్రం అభ్యర్థుల ఫైనల్ లిస్ట్ ప్రకటిస్తామని ఎన్నిక అనివార్యమైతే ఆగస్టు 12వ తేదీ ఎన్నిక జరుగుతుందని వెల్లడించారు. ఆయన వెంట ఏఆర్‌ఓ ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

- జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ
- జిల్లాస్థాయి ప్రధానోపాధ్యాయులు శిక్షణ తరగతులు


మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

శావల్యాపురం: ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు నాయకత్వ లక్షణాలు అలవరుచుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ అన్నారు. బుధవారం మండలంలోని కనమర్లపూడిలోని సంసిద్ స్కూల్లో ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులకు ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులకు మూడోవ రోజు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈవో చంద్రకళ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపుదలకు ప్రధానోపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలన్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు సమయాభావంతో పాటు క్రమశిక్షణలతో కూడిన గుణాత్మక విద్యను విద్యార్థులకు బోధించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల పట్ల విద్యార్థుల తల్లి దండ్రులకు నమ్మకం కల్గిలా ఉపాధ్యాయులు బోధించి మంచి ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకోవటం ద్వారా ప్రతి పాఠశాల్లో విద్యార్థుల హాజరు శాతం నూరుశాతం పెరుగుతుందన్నారు. విద్యార్థుల్లో అభ్యాసన నైపుణ్యాలు పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. రానున్న మూడు నెలల వ్యవధిలో ప్రతి విద్యార్థి చదవటం రాయడం గణితంలో చతుర్విధ ప్రక్రియలను చేసే విధంగా తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను ఉపాధ్యాయులు దృష్టిలో ఉంచుకొని తగిన రీతిలో బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపవిద్యాశాఖాధికారి సుభాని, ఎంఈవో పుసులూరి లలితకుమారి, ఎంఈవో పూర్ణ చంద్రరావు, 212 మంది ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అధికారులు ప్రొటోకాల్ పాటించాలి

రాజుపాలెం: గ్రామాల్లో జరిగే పనులకు కొంతమంది ప్రజా ప్రతినిధులను ఆహ్వానించడం లేదని ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి అధికారులపై మండిపడ్డారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి అధ్యక్షతన బుధవారం జరిగింది. సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు కొంతమంది ప్రజా ప్రతినిధులపై పక్షపాత ధోరణి వహిస్తున్నారని, అలాంటి వారిపై జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని చెప్పారు. జెడ్పీటీసీ సభ్యురాలు దొంతిరెడ్డి సునీత మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల గురించి సంబంధిత ఏపీఓ, వెలుగు కార్యాలయ ఏపీఎంలకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా తీయడం లేదన్నారు. కొందరు అధికారులకు ప్రజాప్రతినిధులంటే లెక్క లేదని ధ్వజమెత్తారు. అదే విధంగా రాజుపాలెం ఎంపీటీసీ బత్తుల సాంబశివరావు మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులకు ప్రొటోకాల్ పాటించడంలేదన్నారు. దీనిపై స్పందించిన ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులందరినీ ఆహ్వానించే విధంగా అధికారులకు తెలియపరుస్తానని, మళ్లీ ఇటువంటి పొరపాటు జరగవని తెలిపారు. మండలస్థాయి అధికారులువారి శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. తహసీల్దార్ సరోజని, ఈఓపీఆర్డీ పగడాల ముక్కంటి, ఎంఈఓ–1,2 మల్లిఖార్జునశర్మ, నరసింహారావు, మండల వ్యవసాయాధికారి పి.వెంకట నర్సయ్య, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

డ్రెయిన్లు.. దోమల నిలయాలు

- పారుదల లేని డ్రెయిన్లతో తిప్పలు
- పెరిగిన దోమల మోత
- నివారణ చర్యలు తీసుకోని అధికారులు


సత్తెనపల్లి అచ్చంపేటరోడ్డులో డ్రెయినేజీలో ముందుకు పారని మురుగు

సత్తెనపల్లి: వాతావరణంలో మార్పులు, పారిశుద్ధ్య లోపం వెరసి సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. మురుగు ముందు కదలక కంపు కొడుతోంది. ఎక్కడికక్కడ దోమల వృద్ధి పెరిగిపోతుంది. దోమల నివారణ కోసం ఫాగింగ్ చేపట్టాల్సి ఉన్నా ఎక్కడా ఆ ఆనవాళ్లు లేవు. జిల్లాలో పారిశుద్ధ్య పనులు మొక్కుబడిగా సాగుతున్నాయి. కాలువల్లో పూడిక తీయకపోవడంతో మురుగునీరు రోడ్లపై పారుతుంది.

దోమల నిలయాలుగా డ్రెయిన్లు

డ్రైనేజీలు, నీటి నిల్వలు ఉన్న ప్రాంతాల్లో దోమల నివారణ కోసం గంబుషియా చేపల వదలడం సైతం అధికారులు విస్మరించారు. దీంతో దోమలు విపరీతంగా వృద్ధి చెందాయి. దోమల మోత పెరిగిపోతుండడంతో ప్రజలకు కంటిమీద కునుకు కరవవుతుంది. దీనికి తోడు పలు వ్యాధులు ప్రబలుతున్నాయి. పేద, మధ్యతరగతి కుటుంబాల వారు దోమల బెడద నుంచి ఉపశమనం పొందేందుకు జెట్ కాయిల్స్, లిక్విడ్ వినియోగిస్తున్నారు. ఇంటి బడ్జెట్‌లో అదనంగా ఈ వ్యయం పెరుగుతోంది. తమ నుంచి పన్నులు వసూలు చేసే అధికారులు మాత్రం దోమల నివారణకు ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదని ప్రజలు మండి పడుతున్నారు.

ఆడ దోమలే వ్యాధులకు మూలం

ఆడదోమలతోనే అన్ని రకాల వ్యాధులు వస్తున్నాయి. ఆడ అనాఫిలస్ దోమ మలేరియాను, ఆడ క్యూలెక్స్ దోమ ఫైలేరియా, మెదడవాపు, ఏడిస్ ఈజిప్ట్ దోమ ఎల్లో ఫీవర్, డెంగీ జ్వరం, చికున్ గున్యాను వ్యాపింపజేస్తున్నాయి. శరీరంపై రక్తం పీల్చుతూ అంటువ్యాధులకు కారణమవుతున్నాయి. ఇవి మనుషులు, జంతువుల రక్తం సునాయాసంగా పీల్చేస్తాయి. ఆడ దోమ 100 రోజులు బతికితే, మగ దోమ 10–20 రోజుల్లోపు చనిపోతుంది.

ఇలా చేస్తే మేలు....

- రాత్రిళ్లు ప్రతి ఒక్కరూ దోమతెరలు తప్పకుండా వాడాలి. దోమలు దగ్గరకు రాకుండా ఉండేందుకు ఇటీవల మార్కెట్లోకి క్రిమిసంహారక మందుతో తయారు చేసినవి అందుబాటులోకి వచ్చాయి.
- నివాస స్థలాల నుంచి దోమలు ఇంట్లోకి రాకుండా జాగ్రత్తపడాలి. కిటికీలు, తలుపులకు మెష్ అమర్చుకోవాలి.
- దోమల సంతతి అధికంగా ఉండే ప్రాంతాల్లో చర్మం కప్పి ఉంచేలా పొడవైన షర్టులు, నైట్ ప్యాంట్లు ధరించాలి. శరీరం వాటికి కనిపించకుండా జాగ్రత్తపడాలి.
- ఇంటి చుట్టూ ఉండే పూల కుండీలు, బకెట్లలో క్రమం తప్పకుండా నీటిని మార్చాలి.
- ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, కొబ్బరి చిప్పలు లేకుండా చూసుకోవాలి.
- ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రై డేగా పాటించాలి.
- చెత్తా చెదారాన్ని మురికి కాలువల్లో వేయరాదు
- మరుగుదొడ్ల గాలి గొట్టాలకు మెష్ కట్టుకోవాలి
- జ్వరం వచ్చిన తక్షణమే ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాలి. నిర్లక్ష్యం చేయడం మంచిది కాదు.

చట్టాలపై అవగాహన అవసరం

సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు
న్యాయమూర్తి ప్రవళిక


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి

గురజాల: చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగిఉండాలని సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జీవీసీ కాలనీలోని బాలికల పాఠశాలలో బుధవారం సాయంత్రం మండల లీగల్ సెల్ అథారిటీ కమిటీ చైర్మన్ ఆర్.శరత్ బాబు ఆదేశాల మేరకు ప్రపంచ మానవ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అవగాహన విషయాలు నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు కోటా శ్రీనివాసరావు, కత్తి చలమరాజు, సీనియర్ న్యాయవాది కె.ప్రభుదాసు తదితరులున్నారు.

మానవ అక్రమ రవాణా అరికట్టాలి

పిడుగురాళ్ల: మానవ అక్రమ రవాణాను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ టి.ప్రవళిక అన్నారు. పట్టణంలోని లెనిన్ నగర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బార్ అసోసియేషన్ సహకారంతో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా న్యాయ అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ.. మోసపూరిత ట్రాఫికింగ్ ముఠా చేతిలో చిక్కకుండా జాగ్రత్తగా ఉండాలని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉన్నప్పుడే భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదుగుతారని, సరైన ప్రణాళికతో లక్ష్యసాధనతో విద్యార్థులు విజయపథంలో దూసుకుపోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.కుమారస్వామి, సెక్రటరీ కోపూరి వెంకటేశ్వర్లు, ప్యానెల్ న్యాయవాదులు పి.మాణిక్యం, ప్రశాంత్‌నాయక్, బి.అచ్చారావు, పారా లీగల్ వలంటీర్ పి.నాగార్జున, పి.నవ్య పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలి


పల్వరైజర్స్ అసోసియేషన్ సభ్యులకు డిమాండ్ నోటీసులు అందజేస్తున్న కార్మికులు

పిడుగురాళ్ల: పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా సున్నం మిల్లు కార్మికులకు కూలి రేట్లు పెంచాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో పల్వరజర్స్ అసోసియేషన్ యాజమానులకు బుధవారం డిమాండ్ నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ... పరతి రెండు సంవత్సరాలకు ఒక సారి జరిగే కూలిరేట్లు ఒప్పందం ముగిసే సమయం దగ్గర పడుతున్న తరుణంలో పెరుగుతున్న ధరలను దృష్టిలో పెట్టుకొని కార్మికులకు ప్రస్తుతం అమలవుతున్న రేట్లుపై 50 శాతం పెంపుదల చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ, సర్వీస్ వంటి చట్టపరమైన సౌకర్యాలు అమలు చేయాలని పని ప్రదేశంలో కార్మికలకు మంచినీళ్లు, మరుగుదొడ్లు, విశ్రాంతి గదులు నిర్మించాలని, మాస్కులు, గ్లౌజులు వంటి సేఫ్టీ సౌకర్యాలు కల్పించాలని ఆయన యాజమాన్యాన్ని కోరారు. అసోసియేషన్ పెద్దలు పల్లరావు, గోపి, రమేష్ కూలి రేట్ల డిమాం నోటీసును అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జయరాజు, యతిరాజుల శివయ్య, చిట్టిబోయిన గిరిబాబు, నల్లమేకల యలమంద, కాకర్ల సాంబయ్య, బత్తుల కొండలు, రామారావు, షేక్ ఖాశీం సాహెబ్, ఆందె సాహెబ్ పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్



పిడుగురాళ్ల: రాష్ట్ర విద్యా శాఖ మంత్రి ఎన్నికల ముందు యువగళం యాత్రలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆయన కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువగళం పాదయాత్రలో జీఓ నంబర్ 107, 108లను రద్దు చేస్తానని లోకేష్ అని గుర్తు చేశారు. ఇచ్చిన హామీ గుర్తుందా అని లోకేష్‌ని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 17 మెడికల్ కాలేజీలను మంజూరు చేయగా అందులో ఐదు మెడికల్ కాలేజీలు ప్రారంభించడం జరగిందన్నారు. మెడికల్‌సీట్లకు సంబంధించిన ఫీజులను మెడికల్ కాలేజీ డెవలప్మెంట్ కోసం డైరెక్ట్‌గా హెల్త్ అండ్ ఫ్యామిలీ అకౌంట్‌కి డిపాజిట్ అయ్యేలా ఆనాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జీఓ జారీ చేసిందన్నారు. యువగళం పాదయాత్రలో వంద రోజుల్లో ఆ జీవోను రద్దు చేస్తామన్నా లోకేష్ 400 రోజులైతున్నా ఉలుకుపలుకు లేదన్నారు. ఇప్పుడు మళ్లీ ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైనా లోకేష్ ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని లేదంటే అలివి కాని హామీ ఇచ్చినందుకు భేషరతుగా రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి క్షమాపణ చెప్పాలని డాక్టర్ అశోక్ కుమార్ డిమాండ్ చేశారు.

రైతులకు సబ్సిడీ విత్తనాలు పంపిణీ


సబ్సిడీపై కంది, మినుము, వరి విత్తనాలు అందజేస్తున్న ఏడీఏ మస్తానమ్మ

క్రోసూరు: మండలంలోని నాగవరం, హసనాబాద్ గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో క్రోసూరు సహాయ వ్యవసాయ సంచాలకులు మస్తానమ్మ పాల్గొని రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న వివిధ పథకాల వివరాలను తెలియజేసారు. సీఆర్సీ కార్డులు కావలసిన కౌలు రైతులు రైతు సేవా కేంద్ర సిబ్బందిని గానీ, గ్రామ రెవెన్యూ అధికారిని గాని సంప్రదించి పొందాలని సూచించారు. ఈసందర్భంగా పాటిబండ్ల హసన్ సుభాని అనే కౌలు రైతుకు సాగుదారు హక్కు పత్రం (సీసీఆర్సీ) కార్డును అందజేసారు. పంటల బీమా పథకం పత్తి, కంది, మిరప పంటలకు జూలై 31వ తేదీ వరకు, వరి పంటకు ఆగస్టు 15 వరకు గడువు ఉన్నందున రైతులు ఈ గడువులోగా సీఎస్సీ కేంద్రాల్లో ప్రీమియం చెల్లించవచ్చునన్నారు. ఈసందర్భంగా రైతులకు 100 శాతం సబ్సిడీపై కంది రకం ఎల్ఆర్జీ– 52, మినుము రకం టీబీజీ, వీబీఎన్–8 , సబ్సిడీపై వరి రకం బీపీటీ 5204 లను అందజేసారు. అనంతరం గ్రామంలో సాగులో ఉన్న పత్తి పంటను రైతులతో కలిసి పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. ఏఓ వేణుగోపాల్, గ్రామ సర్పంచ్ చిరంజీవి రామాంజనేయులు, ఎర్రంశెట్టి రామకృష్ణ, రైతుసేవాకేంద్ర సిబ్బంది షేక్ రూబియా బేగం,రైతులు పాల్గొన్నారు.

పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలి

సత్తెనపల్లి: వివిధ పంటలను సాగు చేసే రైతులు పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలని సత్తెనపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు బోయపాటి రవిబాబు అన్నారు. సత్తెనపల్లి, వడ్డవల్లిలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఏడీఏ రవిబాబు మాట్లాడుతూ వరి పంటకు ఇన్సూరెన్స్ ఆఖరు తేదీ ఆగస్టు 15తో ముగుస్తుందన్నారు. జాతీయ ఆహార భద్రత పథకం కింద కంది, మినప విత్తనాలు చిరు సంచులు పంపిణీ చేశారు.

కుంకలగుంటలో కార్డెన్ సెర్చ్

నకరికల్లు: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా గట్టి నిఘా ఏర్పాటు చేశామని సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు తెలిపారు. మండలంలోని కుంకలగుంట గ్రామంలో బుధవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. వాహనాలు, అనుమానిత ప్రాంతాలను తనిఖీ చేశారు. ప్రజలతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతలు కాపాడేందుకు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనుమానాస్పదంగా ఉన్నవారిపై, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై కఠినచర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.